క్లుప్తంగా

ఎల్లమ్మ ఆదాయం రూ.12.58 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని వెంకాయపల్లె ఎల్లమ్మ అమ్మవారికి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.12.58 లక్షల ఆదాయం సమకూరింది. గురువారం ఆలయంలో హుండీ కానుకలను లెక్కించారు. రెండు నెలల్లో అమ్మవారికి భక్తులు రూ.12,58,363 సమర్పించారని దేవస్థానం ఈఓ సీతారామిరెడ్డి తెలిపారు. కానుకల లెక్కింపులో గోశాల ఈఓ హనుమంతరావు, దేవస్థానం చైర్మన్ బేతం కృష్ణుడు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లీషా ఉరుసు



గంధంతో ఊరేగింపుగా దర్గాకు వెళ్తున్న భక్తులు

సి.బెళగల్: మండల కేంద్రంలో గురువారం హోసూరు అల్లీషా స్వాముల వారి ఉరుసు ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజామున స్వామి వారి గంధాన్ని దర్గాకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఊరేగింపులో పకీర్లు తమ శరీరాలకు ఇనుప చువ్వలను గుచ్చుకుని ప్రత్యేకత చాటుకున్నారు.

ప్రమాదకర మలుపు



మలుపు వద్ద ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు గ్రామం హంద్రీనది బ్రిడ్జి ఉన్న మలుపు ప్రమాదకరంగా ఉంది. ఇరువైపులా ఉన్న రక్షణ గోడలను దాటుకుని ముళ్ల పొదలు రోడ్డుకు అడంగా వచ్చాయి. ఈ రోడ్డుపై నిత్యం వాహనలు రాకపోకలు సాగిస్తుంటాయి. మలుపు ఉండటంతోపాటు ముళ్ల పొదలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనలు కానపడటం లేదని వాహన దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి ముళ్ల కంపలను తొలగించాలని కోరుతున్నారు.

పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాణ్యం: ఈనెల 13న ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని సెక్టోరల్ అధికారి విజయశేఖర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. గదులు, విద్యుత్, తాగునీరు తదితర ఏర్పాట్లను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రం వద్ద ఎన్నికల రోజు 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి ఉన్నారు.

వేలంపాటలు వాయిదా

గూడూరు: నగర పంచాయతీ ఆధ్వర్యంలోని పలు వేలంపాటలు వాయిదా పడ్డాయి. గురువారం పంచాయతీ కార్యాలయంలో వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్ నిర్వహణ కోసం వేలంపాటలు నిర్వహించారు. కాంట్రాక్టర్లు ఎవరూ హాజరు కాకపోవడంతో ఈనెల 15వ తేదీకి వాయిదా వేశామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన అగ్నిమాపకాధికారి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న ఎం.భూపాల్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): ప్రాంతీయ అగ్నిమాపకాధికారిగా నియమితులైన ఎం.భూపాల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలెక్టర్ పి.కోటేశ్వరరావును కలిశారు. గురువారం ఆయన కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలసి పదోన్నతిపై కర్నూలు వచ్చినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కర్నూలు(టౌన్): నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టైలర్స్ కాలనీలో రేషన్ బియ్యం పట్టుబడింది. గురువారం సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు ఓ వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో 57 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని సీజ్ చేశారు. నిందితులు ఫయాజ్, ఆంజనేయులును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు వెల్లడించారు.

రబీపైనే ఆశలు



క్రిష్ణదొడ్డి నీటి నిల్వ ట్యాంక్

అన్నదాత రబీ పంటలపై ఆశలు పెట్టుకున్నారు. క్రిష్ణదొడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా అధికారులు కాలువలకు నీళ్లు వదలడంతో రైతులు భారీగా పంటలు సాగు చేశారు. వారి కష్టాలకు తగ్గట్టుగానే ఎక్కడ చూసిన పైర్లు పచ్చగా కళకళలాడుతున్నాయి. వాతావరణం అనుకూలించి ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించకపోతే అధిక దిగుబడులు కళ్ల చూస్తామనే ఉత్సాహంతో ఉన్నారు. అలాగే ఏప్రిల్ చివరి వరకు సాగు నీరు ఇచ్చి దిగుబడులు చేతికందే వరకు సహకరించాలని అధికారులను వేడుకుంటున్నారు.



రబీలో సాగైన ఎండు మిరప

- క్రిష్ణదొడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా రబీ పంటలకు సాగునీరు
- ఖరీఫ్‌ను మించి సాగు
- కళకళలాడుతున్న పైర్లు
- ఏప్రిల్ చివరి వరకు నీరందిస్తేనే ఫలితమంటున్న అన్నదాత

సి.బెళగల్: మండలంలోని తుగంభద్ర నదీ తీరంలో ఉన్న గుండ్రేవుల వద్ద ఏర్పాటు చేసిన క్రిష్ణదొడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా రబీ సీజన్‌లో రైతులు అధికారులు సాగు నీరు అందిస్తున్నారు. వర్షాలు బాగా పడటంతో భూగర్భ జలాలు పెరిగాయి. ఫలితంగా సాగు నీటి పథకాలు నిండుకుండల్లా ఉన్నాయి. దీంతో అధికారులు రబీకి సాగు నీరిస్తామని ప్రకటించడంతో రైతులు భారీగా పంటలు సాగు చేసుకున్నారు. అధికారుల కూడా గుండ్రేవుల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని మళ్లించి పోలకల్ గ్రామ శివారులో నీటి నిల్వ ట్యాంక్ ద్వారా పదికిపైగా కాలువల ద్వారా పంట పొలాలకు సాగునీరు సరఫరా చేస్తున్నారు. 4,892 ఎకరాల ఆయకట్టు ఉండగా అంతకు మించి పంటలకు సాగు నీటిని అందించారు. పైర్లు కళకళలాడుతుండటం చూసి రైతన్నలు మురిసిపోతున్నారు.



కళకళలాడుతున్న వేరుశనగ పైరు

అధికంగా పంటల సాగు..

ఎత్తిపోతల పథకం ద్వారా ఖరీఫ్ సీజన్‌లో 2,680 ఎకరాలకు సాగునీరు ఇచ్చారు. రబీ సీజన్‌లో రైతులు పంటల సాగుకు ఎక్కువ మక్కువ చూపడంతో 3,095 ఎకరాలకు సాగునీటిని అందించారు. దీనితో ఒకే ఏడాది 6,384 గంటల పంపింగ్‌తో పోలకల్, కొండాపురం, ఇనగండ్ల, మునగాల తదితర గ్రామాలకు చెందిన 5,775 ఎకరాలకు సాగునీరు అందింది.

రబీ సీజన్‌లో సాగవుతున్న పంటల వివరాలు

పంట పేరు	సాగుచేస్తున్న విస్తీర్ణం (ఎకరాలలో)
వరి	845
పత్తి	890
ఉల్లి	1,060
చెరకు	30
మిరప	110
ఇతరములు	160
మొత్తం	3,095

పైర్లు బాగున్నాయి



స్కీమ్ నీళ్లతో పంటలను సాగుచేసుకున్నాం. వర్షాకాలం పంటలతో ఇబ్బందులు ఉండటంతో ఎండా కాలం పంటలపైనే ఆశలు పెట్టుకున్నాం. పైర్లు బాగున్నాయి. దిగుబడులు చేతికందినప్పుడే మా కష్టానికి తగిన ఫలితం ఉంటుంది.

– సోమయ్య, పోలకల్ రైతు

ఏప్రిల్ వరకు వస్తే బాగుంటుంది



ఎత్తిపోతల పథకం కింద ఈ ఏడాది ఖరీఫ్‌లో తక్కువగా పంటలు వేసుకున్నారు. ఎండకాలం పంటలలో (రబీ సీజన్‌లో) ఎక్కువ మంది రైతులు పంటలను సాగు చేసుకున్నారు. కొంతమంది ఆలస్యంగా పంటలను విత్తుకోవడంతో ప్రస్తుతం పూత, పిందె దశల్లో ఉన్నాయి. వీటి పంటకాలం పూర్తి కాలవాలంటే ఏప్రిల్ చివరి వరకు సాగునీరు అందించాలి.

– తిమ్మారెడ్డి, పోలకల్ రైతు

లక్ష్యాన్ని మించి నీటి సరఫరా



క్రిష్ణదొడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా వాస్తవానికి నాలువేల ఎకరాలకు మాత్రమే సాగునీటి అందించాల్సి ఉంది. అయితే ఈ ఏడాది లక్ష్యాన్ని మించి అయిదువేల ఎకరాలకు సాగునీటి అందించడం జరిగింది. అయితే రబీలో కొంతమంది రైతులు ఆలస్యంగా పంటలు చేసుకున్నాం, సాగునీటిని ఏప్రిల్ వరకు సరఫరా చేయాలని కోరుతున్నారు. విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. – సూర్యప్రకాష్, ఇరిగేషన్ ఏఈ

భక్తితో ఆరాధిస్తే సకల శుభాలు

- ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య

కల్లూరు: భక్తితో ఆరాధిస్తే సకల శుభాలు కలుగుతాయని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం కల్లూరులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఉమామహేశ్వర నగర్‌లో ఉన్న ఉమామహేశ్వర పరివార, నవగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్లు సాపూరు మాధురి, సాన శ్రీనివాసులు, డి.లక్ష్మికాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులకు ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసులకు గురువారం 630 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. డ్యాంలో 0.751 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కేసీ కాల్వకు 935 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

నేటి నుంచి వర్కూరులో ఉరుసు

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరులో వెలసిన శ్రీసద్గురు ఖాజాహుసేన్ దాస్ స్వాముల ఉరుసు ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శుక్రవారం గంధం, శనివారం ఉరుసు, ఆదివారం కిస్తీ కార్యక్రమాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా పీఠాధిపతి సద్గురు ఖాజా సుభహాన్ హుసేన్‌దాస్ గురువారం తెలిపారు.

నేడు లక్ష్మీమాధవుల కల్యాణం

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్లలో వెలసిన లక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవారి కల్యాణాన్ని నిర్వహించేందుకు దేవదాయ శాఖాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్యాణాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. కల్యాణం అనంతరం స్వామి అమ్మవార్ల గరుడోత్సవ కార్యక్రమం ఉంటుంది.

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి



లేగ దూడల ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న పశువైద్యాధికారులు

కోడుమూరు రూరల్: పాటు పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఉమ్మడి కర్నూలు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ రాజశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని లద్దగిరి గ్రామంలో మేలు జాతి దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువులు త్వరగా అభివృద్ధి చెందడానికి లింగనిర్ధారిత వీర్యాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ వీర్యం ద్వారా ఆడదూడలు మాత్రమే పుడతాయన్నారు. కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు జాతి దూడలను పొంది అధిక పాల ఉత్పత్తి సాధించవచ్చన్నారు. కోడుమూరు పశువైద్యశాల సహాయ సంచాలకులు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ పాడి పశువులకు 2 చూడు సూదుల ధర రూ.500లని, చూడు నిలువకపోతే రైతు వాటా తిరిగి ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం 62 దూడలకు నట్టల నివారణ మందులను తాపించారు. ఆరోగ్యంగా ఉన్న దూడల యజమానులకు పశువైద్యాధికారులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు రాజశేఖర్‌రెడ్డి, అమృత్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజ స్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో ఉన్న సుబ్రహ్మణ్య సమేత నారాయణస్వామి ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠను గురువారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు మనోహర్‌శర్మ, శశిధర్‌శర్మ ఆధ్వర్యంలో పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వాముల వారికి గణపతి పూజ, అభిషేకార్చనలు, యజ్ఞహోమాదులతో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రాణప్రతిష్ఠ, యంత్రప్రతిష్ఠ, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వినియోగ పూజలు జరిపారు. వేడుకల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు.

15న కౌలు రైతుల జిల్లా సదస్సు

కర్నూలు(సెంట్రల్): మార్చి 15వ తేదీన ఆస్పరిలో కౌలు రైతుల జిల్లా స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, కౌలు రైతు సంఘాల రాష్ట్ర కన్వీనర్ జమ్ములయ్య, రైతు సంఘం ఉపాధ్యక్షుడు ఎ.కాటమయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి హాజరు కానున్నట్లు చెప్పారు.

కబడ్డీ విజేత బెంగళూరు



తుది పోరులో తలపడుతున్న క్రీడాకారిణులు



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామంలో నిర్వహించిన జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలలో బెంగళూరు జట్టు విజేతగా నిలిచింది. మహ్మద్‌షా ఖాద్రీ ఉరుసు సందర్భంగా రెండు రోజుల పాటు హోరాహోరీగా సాగిన పోటీలలో బెంగళూరు జట్టు మొదటి స్థానంలో నిలిచి రూ.25 వేలు కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో నిలిచిన కర్నూలు జట్టు రూ.20 వేలు, మూడో స్థానంలో నిలిచిన అనంతపురం జట్టు రూ.15 వేలు, నాలుగో స్థానంలో గెలిచిన బెంగుళూరు హెచ్ఎస్ అకాడమీ జట్టు రూ.7 వేలు, ఐదో స్థానంలో గెలిచిన తాడిపత్రి జట్టు రూ.5 వేల నగదును దక్కించుకున్నాయి.

బండలాగుడు విజేత బీరంబుల్స్

గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీలో(పాలపళ్ల విభాగం) పాణ్యం మండలం ఎస్ కొత్తూరు బీరం బుల్స్(పెద్ద జత) విజేతగా నిలిచి రూ.50 వేల నగదు బహుమతిని కైవసం చేసుకున్నాయి. రెండవ స్థానంలో బీరం బుల్స్ (చిన్న జత), మూడో స్థానంలో నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండలం రాయవరం రామచంద్రారెడ్డి వృషభాలు, నాలుగో స్థానంలో నంద్యాల జిల్లా పాములపాడు మండలం, తుమ్మలూరు తెలుగు పల్లవి వృషభాలు, ఐదవ స్థానంలో వెల్దుర్తి మండలం కలుగొట్ల గొంది బజారి, కృష్ణాపురం బోయ శివరాముడు వృషభాలు నిలిచాయి. విజేత ఎడ్ల యజమానులకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు పెద్ద వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



అబ్దుల్ రషీద్

కర్నూలు (టౌన్): నగరంలోని మూడవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. స్థానిక బి. క్యాంపు ఆరోరానగర్‌కు చెందిన హెచ్.అబ్దుల్ రఫీక్ కుమారుడు హెచ్ అబ్దుల్ రషీద్ ఈ నెల 5వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్ల, ఇతర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో తండ్రి మూడవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలుడు మూగవాడని, మతి స్థిమితం సరిగ్గా లేదని, 12 సంవత్సరాల వయస్సు ఉంటుందని, 5 అడుగుల ఎత్తు, చామనచాయ కలిగి ఉంటాడని పోలీసులు తెలిపారు. ఆచూకీ లభిస్తే సీఐ 9121101061 సెల్ నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం

– కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక శ్రీవాసవీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల సమావేశంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌తో కలిసి హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హర్ష మాట్లాడుతూ స్థానిక సంస్థల అభ్యర్థి మధుసూదన్, పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి రామచంద్రారెడ్డిలను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో కోడుమూరు. గూడూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథరెడ్డి, మౌలాలి, ఎంపీపీలు గాడి రూతమ్మ, సునీత, వైస్ ఎంపీపీలు విజయ్‌కుమార్ రెడ్డి, లక్ష్మిదేవి, గూడూరు మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు అస్లామ్, లక్ష్మన్న, సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగెడితేనే.. ప్రమాదం

శునకాలు కనపడితే భయం వద్దు

- జాగ్రత్తలు తీసుకుంటే కాటు నుంచి తప్పించుకోవచ్చు
- వాటి వైపు చూడకుండా దూరంగా మెల్లగా నడవాలి
- వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు



కర్నూలు(అగ్రికల్చర్): పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా వీధి కుక్కల సంఖ్య పెరిగిపోతోంది. దీంతో రోడ్లపై గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో చిన్నారిపై కుక్కలు దాడి చేసి ప్రాణాలు బలిగొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రజలు శునకాలు కనిపిస్తేనే భయాందోళన చెందుతున్నారు. అయితే వీధి కుక్కలు కనపడితే పిల్లలు, పెద్దలు భయపడవద్దని, పరిగెడితే వెంటపడి కరుస్తాయని పశుసంవర్ధక శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే కుక్క కాటు నుంచి తప్పించుకోవచ్చని సూచిస్తున్నారు.

3 వేల వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు:

ఇటీవల కాలంలో జిల్లాలో కుక్కలు గొర్రెల మందలపై దాడులు చేయడం, విద్యార్థులు, చిన్నారులను కరవడం ఎక్కువైంది. ఈ నేపథ్యంలో వాటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సంతానోత్పత్తి కలగకుండా వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. కర్నూలు నగరపాలక సంస్థలో 2022 ఆగస్టు నుంచి ఇప్పటి వరకు దాదాపు 3 వేల వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు చేయడం విశేషం. ఆపరేషన్ అయిన కుక్కలు దీర్ఘాయుస్సుతో బ్రతకడమే కాకుండా ఆరోగ్యంగా ఉంటాయి. చెవిని కత్తరించి ∩ ఆకారంలో ఉంటే ఆపరేషన్ అయిందని గుర్తు. ఆడకుక్కల వెంట మగకుక్కలు తిరగడం చాల వరకు తగ్గిపోతుంది. ఆపరేషన్ అయినవి కరవడం చాల తక్కువ. ఎందుకంటే వాటిలో ఆగ్రహం తగ్గిపోతుంది. కుక్కల నివారణకు శస్త్ర చికిత్సలు, రేబిస్ టీకాలు వేయించడం సురక్షితమైన శాశ్వత పరిష్కారం.

జాగ్రత్తలు ఇలా..

- కుక్క దగ్గరికి వస్తే ఏ మాత్రం కదలకుండా నిలబడి ఉండటం ఉత్తమం. ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగెత్తరాదు. కుక్కల కళ్లలోకి తదేకంగా చూడరాదు. వాటి పిల్లల దగ్గరికి వెళ్లరాదు. తల్లి కుక్క కాటువేసే ప్రమాదం ఉంది.
- నిద్రిస్తున్నపుడు, తింటున్నపుడు, పిల్లలకు పాలిస్తున్నపుడు వాటిని కర్రలు, రాళ్లతో అదిలించడం గాని, ఏ రకంగానైన ఇబ్బంది పెట్టొద్దు.
- ఒక వేళ కుక్క దాడి చేస్తే ముఖాన్ని చేతులతో లేదా ఏదైనా కప్పుకోండి. ఎందుకంటే ముఖాన్ని కరిస్తే ఇన్‌ఫెక్షన్ మెదడుకు త్వరగా సోకుతుంది
- కుక్క కోపంగా మీ దగ్గరికి వస్తే నేల వైపు చూస్తూ దానికి దూరంగా మెల్లగా నడవాలి. ఎలాంటి భయం లేకుండా తనదారిన తాను పోతే కుక్కలు పట్టించుకోవు.
- ఒక వేళ శునకం కరిస్తే అక్కడ కుళాయి లేదా చెంబుతో నీటిధారపోస్తూ సబ్బుతో పది నిముషాలు కడగాలి. లైఫ్‌బాయ్ సబ్బు అయితే మంచిది. డెటాల్, బెటాడిన్ లేదా గడ్డం గీసుకున్న తర్వాత వాడే లోషన్ పూయాలి. వీలైనంత త్వరగా వైద్యుడిని సంప్రదించాలి. పిచ్చి కుక్క అయితే వెంటనే రేబిస్ టీకాలు వేయించాలి. అయితే గాయాన్ని రుద్ది కడగరాదు. గాయంపై టింక్చర్ అయోడిన్ వేయకూడదు. గాయానికి కట్లు వేయడం, గట్టిగా నొక్కడం చేయరాదు

భయపడేకొద్ది చెలరేగిపోతాయి



తగిన జాగ్రత్తలు తీసుకుంటే కుక్కకాటు నుంచి తప్పించుకోవచ్చు. కొంతమంది కుక్కలను చూసి కరుస్తాయనే భయంలో ముందుకు వెళ్లారు. అది పద్ధతి కాదు. మనం భయపడేకొద్ది కుక్కలు చెలరేగిపోతాయి. ప్రభుత్వం వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయతీల్లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేపడుతున్నారు. పెంపుడు కుక్కలకు విధిగా టీకాలు వేయించాలి.

– డాక్టర్ రవిబాబు, అసిస్టెంటు డైరెక్టర్, పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం

ప్రీఫైనల్ పరీక్షల తనిఖీ

కోడుమూరు రూరల్: మండల పరిధిలోని అమడగుంట్ల పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలను గురువారం ఎంఈఓ అనంతయ్య తనిఖీ చేశారు. ప్రీఫైనల్ పరీక్షల వల్ల ఫైనల్ పరీక్షల పట్ల భయం పోతుందన్నారు. అలాగే ఏయే సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నామనే విషయాన్ని గ్రహించి రివిజన్ చేసుకునేందుకు ఉపయోగ పడతాయన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ పనులు



కర్నూలు(టౌన్): కర్నూలు నగరంలోని మునగాలపాడు వద్ద 1200 ఎంఎం సామర్థ్యం కలిగిన పైప్‌లైన్ లీకేజీ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. నగరపాలక కమిషనర్ భార్గవతేజ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఎస్ఈ శేషసాయి, డీఈ రవిప్రకాష్ నాయుడు అక్కడే ఉండి మరమ్మతు పనులు చేయిస్తున్నారు. గురువారం వారు మాట్లాడుతూ ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపడుతున్న కారణంగా నగరవాసులకు రెండు రోజులు తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం నాటికి పనులు పూర్తవుతాయని చెప్పారు.